## రవీంద్ర భారతిలో ఆకట్టుకున్న సైన్స్ ఎక్స్‌పో



కుషాయిగూడ: ఈసీఐఎల్‌లోని రవీంద్ర భారతి స్కూల్‌లో శనివారం నిర్వహించిన సైన్స్ ఎక్స్‌పో ఆకట్టుకుంది. ఐఎఫ్‌హెచ్ఈ యూనివర్సిటీ జాయింట్ రిజిస్ట్రార్ టీవీఆర్ సాయివిఠల్, ఎన్ఎఫ్‌సీ డిప్యూటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఎమ్‌వీ రమణ, సీనియర్ సైంటిస్ట్ భూమన్న ముఖ్య అతిథులుగా హాజరై ఎక్స్‌పోను ప్రారంభించారు. విద్యార్థులు వారి మేధస్సుకు పదును పెట్టి రూపొందించిన బిందు సేద్యం, సోలార్ ప్యానెల్ హీటర్, హైడ్రో ఎలక్ట్రికల్ పవర్ ప్లాంట్, డయాలసిస్, గుండె పనిచేయు విధానం వంటి అనేక శాస్త్ర సంబంధిత నమూనాలను రూపొందించారు. విద్యార్థులు రూపొందించిన ఎగ్జిబిట్స్ ఆలోచింపజేసేలా ఉన్నాయని అతిథులు అభినందించారు. ప్రిన్సిపల్ లలిత, డీన్ శ్రీదేవి, డీఐ క్రాంతి, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## సాయిబాబానగర్ సమస్యలు పరిష్కరించండి



అల్వాల్: అల్వాల్ సర్కిల్ మచ్చబొల్లారం డివిజన్ సాయిబాబానగర్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు శనివారం కాలనీలో రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సాయిబాబానగర్ కాలనీని అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదన్నారు. కాలనీలో ముఖ్యంగా డ్రైనేజీ పొంగిపొర్లుతోందని, కాలనీలో ఇళ్ల ముందు ర్యాంపులు, చెట్ల కోసం ఇనుప కంచెలతో నిర్మాణాలు చేపట్టడంతో ఆక్రమణలకు గురైన రోడ్లు ఇరుగ్గా మారి ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. కాలనీలో అంతర్గత రోడ్లు సరిగ్గా లేవని, రోడ్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షులు శ్రీధర్, అధ్యక్షులు మల్లారెడ్డి, ఉపాధ్యక్షులు సంజీవరెడ్డి, ప్రధాన కార్యదర్శి సమ్మిరెడ్డి, శాలివాహన్, వరుణ్‌కుమార్, సత్యనారాయణ, సుభాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## రామేశ్వరం వద్ద అల్వాల్‌వాసి మృతి



శ్రీనివాస్ (ఫైల్)

అల్వాల్: అల్వాల్ సర్కిల్ టెంపుల్ అల్వాల్‌కు చెందిన దేచు శ్రీనివాస్(48) శ్రీవెంకటేశ్వర కిరాణా షాప్ నిర్వహిస్తున్నాడు. శ్రీనివాస్ తమిళనాడులోని రామేశ్వరం సమీపంలో కారు ప్రమాదానికి గురై మృతిచెందాడు. మృతుడి కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. దేచు శ్రీనివాస్ ఈ నెల 13వ తేదీన స్నేహితులతో కలిసి తిరుపతి వెళ్లి దర్శనం చేసుకొని అక్కడి నుంచి కేరళ శబరిమల వెళ్లి దర్శనం చేసుకొని అనంతరం తమిళనాడులోని రామేశ్వరం చేరుకునే సమయంలో రామనాథపురం సమీపంలో వారు ప్రయాణిస్తున్న కారు రోడ్డు ప్రమాదానికి గురైంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న వారిలో శ్రీనివాస్ మృతిచెందగా రాజారెడ్డి, సంతోష్, రామకృష్ణ, కాశీలకు తీవ్ర గాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

# కారణజన్ముడు కేసీఆర్

**ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

రామంతాపూర్: మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం రామంతాపూర్ ప్రధాన రహదారిలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, సీనియర్ బీఆర్ఎస్ రాష్ట్ర నేత రాగిడి లక్ష్మారెడ్డిలు, కార్యకర్తలు నేతలతో కలిసి కేక్‌కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ కారణజన్ముడని అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గంధం జ్యోత్స్న నాగేశ్వర్‌రావు, పసుల ప్రభాకర్ రెడ్డి, మహ్మద్ ముస్తాక్ తదితరులు పాల్గొన్నారు.

**మల్కాజిగిరి చౌరస్తాలో..**

మల్కాజిగిరి: బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను మల్కాజిగిరి చౌరస్తాలో పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి కేక్ కట్ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

**మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ వార్డు కార్యాలయంలో..**

కుషాయిగూడ: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టినరోజు వేడుకలను శనివారం మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ వార్డు కార్యాలయంలో నిర్వహించారు. కార్పొరేటర్ ప్రభుదాస్ కేక్ కట్ చేశారు. తిరుమలనగర్‌లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ పంపిణీ చేశారు. మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, బోదాసు రవి, మల్లేష్‌గౌడ్, కృష్ణమూర్తి, నవీన్‌గౌడ్, గడియారం రామకృష్ణ, వసంతరావు, బొల్లం జ్యోతి, భవాని, హరినాథ్‌రెడ్డి, జయపాల్, సాయికుమార్ పాల్గొన్నారు.

**చక్రిపురం చౌరస్తాలో..**

బీఆర్ఎస్ చర్లపల్లి డివిజన్ కమిటి ఆధ్వర్యంలో చక్రిపురం చౌరస్తాలో మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. డివిజన్ పార్టీ అధ్యక్షుడు దప్పు గిరిబాబు, బీఆర్ఎస్ నాయకులు అనుముల నర్సింహారెడ్డి, సప్పిడి శ్రీనివాస్‌రెడ్డి, పాండాల శివకుమార్‌గౌడ్, మహేష్‌గౌడ్, తాళ్ల వెంకటేష్‌గౌడ్, బొడిగె రాజు, పనగట్ల చక్రపాణిగౌడ్ పాల్గొన్నారు.

**మల్లాపూర్, నాచారంలో..**

మల్లాపూర్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినోత్సవాన్ని మల్లాపూర్ తెలంగాణ తల్లి విగ్రహం వద్ద మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

నాచారంలో: మాజీ సీఎం కేసీఆర్ జన్మదినోత్సవాన్ని నాచారం వైజయంతి చౌరస్తాలో జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

**రాధిక చౌరస్తాలో..**

కాప్రా: ఏఎస్‌రావునగర్ డివిజన్ అధ్యక్షుడు కాసం మహిపాల్ రెడ్డి రాధిక చౌరస్తాలో కేక్‌కట్ చేశారు. బండారి నీలంరెడ్డి, ఏఎస్‌రావునగర్ కార్పొరేటర్ సింగిరెడ్డి శ్రీరీషా సోమశేఖర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు కొత్తరామరావు, పావనిరెడ్డి కాప్రా బీఆర్ఎస్‌నేతలు తదితరులు పాల్గొన్నారు.

**ఉప్పల్ గాంధీ నగర్‌లో..**

ఉప్పల్: రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్ ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను ఉప్పల్ గాంధీ నగర్‌లోని బాలికల చైల్డ్ కేర్‌లో నిర్వహించారు.

**చిలుకానగర్‌లో..**

చిలుకానగర్ చౌరస్తాలో చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో కేసీఆర్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు రాగిడి లక్ష్మారెడ్డి, పల్లె నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

**ఉప్పల్ గాంధీ విగ్రహం వద్ద..**

ఉప్పల్ డివిజన్ పరిధిలోని గాంధీ విగ్రహం వద్ద పూడురు జితేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేసీఆర్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో రాగిడి లక్ష్మారెడ్డి, మేకల హన్మంత్ రెడ్డి, ఆకుల మహేందర్, అరటికాయల భాస్కర్, బాలకృష్ణ, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



రామంతాపూర్ ప్రధాన రహదారిలో కేసీఆర్ జన్మదిన వేడుకలు



మల్కాజిగిరి చౌరస్తాలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



ఉప్పల్ గాంధీనగర్‌లో కేసీఆర్ జన్మదిన వేడుకల్లో ఇంతియాజ్ ఇసాక్



చిలుకానగర్‌లో కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్



చక్రిపురం చౌరస్తాలో కేసీఆర్ పుట్టినరోజు వేడుకలు.

# అన్ని కులాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

**కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి పరమేశ్వర్‌రెడ్డి**

మల్లాపూర్: రాష్ట్రంలోని అన్ని కులాల అభివృద్ధి, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గం ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. కులగణనపై అసెంబ్లీలో తీర్మానం పట్ల మల్లాపూర్ డివిజన్‌లో పూలే విగ్రహానికి పాలాభిషేకం చేసి సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు నెమలి అనిల్, సుదర్శన్, బెల్లం శ్రీను, రాజుగౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, జమీలాబేగం, రాజేష్, కిట్టు, సాయిగౌడ్, జోషి, మల్లు, సతీష్, ప్రభాకర్‌రెడ్డి, పర్వతాలు, బాలరాజ్‌గౌడ్, మున్నిబేగం తదితరులు పాల్గొన్నారు.

**నాచారంలో..**

అసెంబ్లీ రాష్ట్ర కులగణనపై తీర్మానం చేసిన సందర్భంగా టీపీసీసీ పిలుపు మేరకు శనివారం కాంగ్రెస్ నాచారం అధ్యక్షుడు బందారం శ్రీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ మోహన్, వెంకటేష్, కృష్ణారెడ్డి, రాంరెడ్డి, రఘు, భద్రయ్య పాల్గొన్నారు.

**కాప్రాలో..**

కులగణన తీర్మానం అసెంబ్లీలో ఆమోదింపజేసినందుకు కాప్రా కార్పొరేటర్ స్వర్ణరాజ్ ఆధ్వర్యంలో జ్యోతిరావుపూలే విగ్రహానికి పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్ నాయకులు ధన్‌పాల్‌రెడ్డి, రాఘవరెడ్డి, నాగేష్, పత్తికుమార్ పాల్గొన్నారు.

**అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం**

కుషాయిగూడ: రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. కులగణనపై అసెంబ్లీలో తీర్మానం చేయడాన్ని హర్షిస్తూ పార్టీ డివిజన్ అధ్యక్షుడు సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం చక్రిపురం చౌరస్తాలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. సీతారాంరెడ్డి, గోపాల్‌యాదవ్, మన్మోహన్‌రెడ్డి, ఆనంద్‌రాజ్‌గౌడ్, మెరుగు సునీత తదితరులు పాల్గొన్నారు.

**బలహీనవర్గాల భగవంతుడు పూలే**

రామంతాపూర్: కుల గణనకు అసెంబ్లీలో తీర్మానం చేయడం పట్ల హర్షం వ్యక్తంచేస్తూ శనివారం రామంతాపూర్ ప్రధాన రహదారిలోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి ఉప్పల్ కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు రఘుపతిరెడ్డి, జగన్‌గౌడ్, ఆగంరెడ్డి, గిరిబాబు, రఫీక్, మురళీగౌడ్, పెంటయ్య, అమరేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



మల్లాపూర్‌లో పూలే విగ్రహం వద్ద సంబురాల్లో మందముల్ల పరమేశ్వర్‌రెడ్డి తదితరులు



చక్రిపురం చౌరస్తాలో పూలే చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి



పూలే విగ్రహానికి పాలాభిషేకం చేస్తూ..



కాప్రాలో పూలే విగ్రహం వద్ద కాప్రా కార్పొరేటర్ స్వర్ణరాజ్



పూలే విగ్రహానికి పాలాభిషేకం చేస్తూ..

## బచ్‌పన్ స్కూల్ వార్షికోత్సవం



మేడిపల్లి: మేడిపల్లి బచ్‌పన్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. మేడిపల్లి ప్రిన్సిపల్ జ్యోత్స్నదేవి ముఖ్యఅతిథిగా హాజరై వార్షికోత్సవాన్ని ప్రారంభించారు. డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, రూపారెడ్డి, రీజనల్ ఆపరేషన్ అండ్ టెక్నాలజీ డైరెక్టర్ కౌశిక్ రెడ్డి, ఆపరేషన్ మెడ్ గిరీష్ మఖ్వానా పాల్గొన్నారు.



## రక్తదాతలు దేవుళ్లతో సమానం



రామంతాపూర్: ప్రధాన రహదారి పెద్ద చెరువు ఎదురుగా ఉన్న సిమ్‌లైన్ ఫిట్‌నెస్ జిమ్‌లో శనివారం జయసింహ ఫౌండేషన్ చైర్మన్ జయసింహగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించి 75 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా జయసింహ మాట్లాడుతూ రక్తదాతలు దేవుళ్లతో సమానమని, వీరు దానం చేస్తే ప్రాణపాయ స్థితిలో ఉన్న వారెందరికో జీవం పోస్తున్నారని అన్నారు. సమాజ సేవ చేయడానికి రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఆరు నెలలకు ఒకసారి రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు, పలు జిమ్‌లలో వ్యాయామం చేసే యువతి, యువకులు రక్తదానం చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారని ఆయన తెలిపారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి పిలుపు మేరకే కాంగ్రెస్‌లోకి..



కుషాయిగూడ: తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపు మేరకు తాను కాంగ్రెస్‌లో చేరినట్లు చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి స్పష్టం చేశారు. కాంగ్రెస్‌లో చేరిన సందర్భంగా శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ కాలం నుంచి బీఆర్ఎస్‌ను నమ్ముకొని పార్టీకి విధేయులుగా పనిచేసుకుంటూ వచ్చామన్నారు. ఉద్యమ నాయకులను విస్మరించి పదవుల కోసం పార్టీలోకి వచ్చిన వారికి పెద్దపీట వేస్తూ పలుమార్లు అవమానించినా భరించామన్నారు. ప్రతిసారి ఇదే విధమైన అన్యాయం జరగడం, మమ్మల్ని నమ్ముకున్న వారే జీర్ణించుకోలేని పరిస్థితులు రావడంతో మా భవిష్యత్ కార్యచరణకు సిద్ధమైనట్లు ఆమె పేర్కొన్నారు.

## సింధూర వైన్స్ తరలించాలంటూ ధర్నా



సింధూర వైన్స్ తరలించాలంటూ ధర్నా చేస్తున్న నేతలు

బోడుప్పల్: బోడుప్పల్ సిద్దార్థ స్కూల్ ఎదురుగా కాలనీ మధ్యలో ఏర్పాటు చేస్తున్న సింధూర వైన్స్, లిక్కర్ మార్ట్‌ను వేరే ప్రాంతానికి తరలించాలంటూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. వారికి పీర్జాదిగూడ బీఆర్ఎస్ అధ్యక్షుడు దర్గ దయాకర్ రెడ్డి సంఘీబావం తెలిపారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, దర్గ దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ నిత్యం ప్రజలతో రద్దీగా ఉండే ప్రదేశం, కాలనీవాసులకు, పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రి మధ్యలో సింధూర వైన్స్‌ను ఏర్పాటు చేయడం దారుణమన్నారు. షెడ్‌కు కూడా ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మిస్తున్నారని, అధికారులు వెంటనే స్పందించి ఇక్కడ నుంచి వేరే చోటకు తరలించాలని వారు కోరారు. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిన్న, కార్యదర్శి ఎండీ అన్వర్, నాయకులు హరీష్, రాజు, కాలనీ వాసులు శంకర్‌రెడ్డి, సౌజన్య, శ్రీలత, మానస, చందన, కళ్యాణ్, పరమేశ్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆధునిక పద్ధతిలో విద్యా బోధన చేయాలి



జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి

బోడుప్పల్: మారుతున్న విద్యా విధానాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు ఆధునిక పద్ధతిలో విద్యా బోధన చేయాలని అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బోడుప్పల్ బచ్‌పన్ అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోపాటు అన్ని రంగాల్లో విద్యార్థులు రాణించే విధంగా తర్ఫీదు ఇవ్వాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ రూపారెడ్డి, టెక్నికల్ డైరెక్టర్ కౌశిక్‌రెడ్డి, మార్కెటింగ్ కంట్రీ హెడ్ గిరీష్ మక్వానా, జనరల్ కౌన్సిల్ లీగల్ ఆపరేషన్స్ ఆకాష్‌గుప్తా, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఎప్సిలాన్ ఎలక్ట్రానిక్స్ ఎదుట కార్మికుల ఆందోళన



కుషాయిగూడ: సకాలంలో జీతాలు చెల్లించకుండా పని వేళలు పెంచుతున్నారంటూ యజమాన్యం తీరును నిరసిస్తూ శనివారం ఈసీఐఎల్‌లోని ఎప్సిలాన్ ఎలక్ట్రానిక్స్ ఎక్విప్‌మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఎదుట కార్మికులు ఆందోళనకు దిగారు. తొమ్మిది రోజులుగా నిరసన చేపడుతున్నా యజమాన్యం పట్టించుకోవడం లేదని ఆవేదన చెందారు. ఇప్పటికైనా యజమాన్యం న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే ఆందోళన ఉదృతం చేస్తామన్నారు. ఎలాంటి ముందస్తు నోటీసు ఇవ్వకుండా సమ్మెకు దిగడంపై కంపెనీ యజమాన్యం ఆగ్రహం వ్యక్తం చేసింది. శనివారం కార్మికులకు నోటీసులు జారీ చేసింది. సమ్మె కాలానికి జీతాలు చెల్లించడం జరగదని, తక్షణమే సమ్మె విరమించి విధుల్లో చేరాలని, లేని పక్షంలో విధుల నుంచి బహిష్కరిస్తామంటూ నోటీసుల్లో పేర్కొంది.

## జ్ఞాపికల ప్రదానం

రామంతాపూర్: రామంతాపూర్ ఉప్పల్ మినీ శిల్పారామంలో వారాంతపు సంస్కృతి కార్యక్రమాల్లో భాగంగా హిమబిందు నేతృత్వంలో పియానో, గిటార్, కూచిపూడి, భరతనాట్యం, సంగీత అంశాలలో ప్రతిభ కనబర్చిన కళాకారులందరికీ శనివారం జ్ఞాపికలు ప్రదానం చేశారు.

## ఉప్పల్ ఆర్టీవోగా వాణి



రామంతాపూర్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శనివారం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ఉప్పల్ ఆర్టీవోగా వాణి బదిలీ అయ్యారు. గతంలో ఈమె కామారెడ్డిలో ఆర్టీవోగా విధులు నిర్వర్తించారు.

## అభినందనలు



అల్వాల్: రాచకొండ కమిషనర్‌గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన తరుణ్‌జోషిని శనివారం నేరేడ్‌మెట్‌లోని సీపీ కార్యాలయంలో వైఎస్సార్ టీపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు తడక జగదీశ్వర్‌గుప్తా మర్యాదపూర్వంగా కలిసి అభినందనలు తెలిపారు.

## చిన్న రాయుని చెరువును పరిశీలించిన కోర్టు బృందం



చిన్నరాయుని చెరువును పరిశీలిస్తున్న కోర్టు బృందం

అల్వాల్: చెరువులను క్షేత్రస్థాయిలో పరిశీలించడం కోసం ఏర్పాటైన కోర్టు పరిశీలక బృందం శనివారం అల్వాల్‌లోని చిన్నరాయుని చెరువును పరిశీలించింది. గతంలో చెరువు విస్తీర్ణం ప్రస్తుతం ఉన్న పరిస్థితిని, చెరువులో కలుస్తున్న కాలుష్యాలను అరికట్టడంలో అధికారుల వైఫల్యంతో పాటు చెరువు పరివాహక ప్రాంతాలు ఆక్రమణలకు గురవుతున్నాయని స్థానికులు పరిశీలక బృందానికి తెలియజేశారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ, రెవెన్యూ, నీటి పారుదల శాఖ, జలమండలి అధికారులు పాల్గొన్నారు.

**THE ECIL EMPLOYEES COOPERATIVE HOUSE CONSTRUCTION SOCIETY LTD.,**
**REGD.No.TBC-183, Dr AS RAO NAGAR, KAPRA MANDAL, MEDCHAL-MALKAJGIRI DISTRICT.**

**ELECTION NOTICE**

**Under. Rule 22(8A) (vii) of the TCS Rules, 1964.**

All the members of the ECIL Employees Cooperative House Construction Society Ltd., Regd.No. TBC-183, Dr AS Rao Nagar, Kapra Medchal - Malkajgiri District are hereby informed that the elections to the Managing Committee are ordered by the State Cooperative Election Authority, Telangana, Hyderabad vide proceedings Rc.No. 262/MDL/SCEA/2024, Dt: 12.02.2024 which is to be held on **29.02.2024** and the detailed Election Programme is shown below.

**DETAILED PROGRAMME**

| DATE | TIME | PROGRAMME | PLACE |
|---|---|---|---|
| 20.02.2024<br>21.02.2024<br>22.02.2024 | From 11.00 AM to 3.00.00 PM | Filing of Nomination for the post of Managing Committee Members | Society Office, The ECIL Employees Cooperative House Construction Society Ltd., Regd.No. TBC-183, Dr AS Rao Nagar,Kapra Medchal - Malkajgiri District |
| 23.02.2024 | From 11.00 AM onwards | Scrutiny of Nominations and publications of valid list of Nominations | |
| 24.02.2024 | 11.00 AM to 5.00PM<br>After 5.00 PM | Withdrawal of Nominations<br>Publication of Final List of Nominations | |
| 29.02.2024 | From 9.00 AM to 3.00 PM | POLLING | Society Office Premises i.e., The ECIL Employees Cooperative House Construction Society Ltd., Regd.No. TBC-183, Dr AS Rao Nagar, Kapra Medchal - Malkajgiri District |
| 29.02.2024 | From 3.00 PM onwards | Counting of votes and declaration of results | Society Office Premises i.e., The ECIL Employees Cooperative House Construction Society Ltd., Regd.No. TBC-183, Dr AS Rao Nagar, Kapra Medchal - Malkajgiri District |

The Nomination forms may be obtained from the Election Officer or the person authorized by him on written requisition on 20.02.2024 from 11.00 AM to 3.00 PM at the seat of the Society.

*For further details contact the Election Officer- Cell No 9100115723

**Place: Dr AS Rao Nagar**
**Date: 17.02.2024.**

Sd/-
**V.Nagalingachary**
Deputy Registrar/Election Officer
O/o the District Cooperative Officer,
Medchal-Malkajgri District.

**Note:** The members are requested to bring Photo Identity cards issued by the Society or other proof of Photo Identity for the purpose of identification at the Polling Station.

## అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

కుషాయిగూడ: కిడ్నాపర్ అనే అనుమానంతో ఓ వ్యక్తికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన ఘటన శనివారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. చర్లపల్లి డివిజన్ ద్వారకపురి కాలనీలో శనివారం ఉదయం ఓ వ్యక్తి స్వీకర్లు విక్రయించేందుకు తిరుగుతున్నాడు. ఓ చిన్నారిని మాటల్లో పెట్టాడు. ఇంట్లో ఎవరెవరు ఉన్నారని అడిగాడు. అంతలోనే చిన్నారి తల్లి బయటకు వచ్చి ఇరుగు పొరుగు వారిని పిలిచి నిలదీసింది. సరైన సమాధానం చెప్పకపోవడంతో అతడికి దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై కుషాయిగూడ ఎస్ఐ షఫిని వివరణ కోరగా అతడు బీహార్‌కు చెందిన సోహన్‌గా గుర్తించినట్లు తెలిపారు. స్వీకర్లు అమ్ముకుంటూ సికింద్రాబాద్‌లో నివాసం ఉంటున్నట్లు పేర్కొన్నారు. కాలనీకి చెందిన మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినందుకు కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు.

## చైర్మన్ అన్న సత్తిరెడ్డిపై భూఆక్రమణ కేసు

పోచారం: ప్రహరీ గోడ కూల్చి ప్లాటు ఆక్రమించాడన్న ఫిర్యాదు మేరకు పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అన్న బోయపల్లి సత్తిరెడ్డిపై పోచారం పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు వివరాలిలా ఉన్నాయి. అన్నోజిగూడ సర్వే నంబర్- 92లోని భూమిని సుమారు 30 ఏళ్ల క్రితం లేఅవుట్ చేశారు. ఇందులోని ప్లాట్ నెంబర్–78 చుట్టూ ప్రహరీ గోడను 2005వ సంవత్సరంలో నిర్మించారు. ఈ ప్లాట్ యజమాని కృష్ణారెడ్డి 2019లో పైళ్ల మమతకు విక్రయించారు. సదరు ప్లాటును హెచ్ఎండీఏ నిబంధనల ప్రకారం రెగ్యులరైజ్ చేయించారు. ఇదిలా ఉండగా ప్లాట్ నెంబర్–73 యజమాని బోయపల్లి సత్తిరెడ్డి 78 ప్లాట్‌కు పడమర వైపున ఉన్న గోడను కూల్చివేసి సుమారు 16 చదరపు గజాల జాగాను ఆక్రమించి ప్రహరీ గోడ నిర్మించారు. దీంతో తనకు సుమారు రూ.9 లక్షల ఆస్తినష్టం కలిగిందని పోచారం పోలీస్ స్టేషన్‌లో మమత ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు 447, 427, 506, సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.